రిపోర్టర్లు కావలెను
ప్రకాశం జిల్లాలో 'జాతీయ వార్త' తెలుగు దినపత్రికలో పనిచేసేందుకు ఆసక్తి ఉన్న రిపోర్టర్లు సంప్రదించగలరు
9908862557

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com
ప్రకాశం జిల్లా వార్తలు
బుధవారం | 17-6-2026 | ప్రకాశం | సంపుటి: 3 సంచిక: 703 పేజీలు: 2 వెల : రూ.2





# ఎరువుకూ.. యాప్ సోపాలే!

* ఎరువుల వినియోగంపై కొత్తరాగం అందుకున్న ప్రభుత్వం
* ఏపీఏఐఎంఎస్ యాప్‌లో నమోదైతేనే ఎరువులు
* యాప్‌తో తిప్పలు పడుతున్న రైతులు
* యాప్‌లో చూపిస్తున్నా అందని ఎరువులు
* సాంకేతికతతో కొత్త చిక్కులు
* యూరియా కోసం రైతుల పడిగాపులు
* దళారులను అరికట్టబోయి.. అసలుకే ఎసరు పెట్టిన ఆన్ లైన్ విధానం
* అధికారులు స్పందించకుంటే ప్రమాదం

కందుకూరు, జూన్ 16 (జాతీయ వార్త): ఎరువుల కోసం, రైతన్న ఇప్పుడు 'డిజిటల్' యుద్ధం చేయాల్సి వస్తోంది! 'దళారుల కబంధ హస్తాల నుంచి మిమ్మల్ని రక్షిస్తాం.. మీ కష్టాలు తీరుస్తాం' అని ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'యాప్' విధానం, క్షేత్రస్థాయిలో ఇప్పుడు రైతన్న పాలిట శాపంగా మారింది. చేతిలో ఫోన్ పట్టుకుని, యాప్లో చూపిస్తున్న 'గ్రీన్ సిగ్నల్' (స్టాక్) ను నమ్మి, ఆశగా ఎరువుల షాపుల గడప తొక్కితే.. అక్కడ దర్శనమిస్తున్న 'నో స్టాక్' బోర్డులు అన్నదాతల ఆశలను నిలువునా కూల్చేస్తున్నాయి. సాంకేతికతతో సేద్యం సులభతరమవుతుందని ఆశపడ్డ కష్టజీవికి, ఇప్పుడది అంతులేని అగచాట్ల ను మిగులుస్తోంది. యాప్లో వేల బస్తాలు నిల్వ ఉన్నట్లు కనిపిస్తున్నా, తీరాషాపు దగ్గరికి వెళ్తే మాత్రం 'మా దగ్గర లేవు' అని డీలర్లు మొండి చేయి చూపుతుండటంతో... కిలోమీటర్ల దూరం నుంచి వచ్చిన రైతన్నలు తిరుగుముఖం పడుతున్నారు. ఒకవైపు నిరక్షరాస్యులైన రైతులకు యాప్ వాడకం తెలియక సతమతమవుతుంటే, మరోవైపు డిజిటల్ మాయాజాలంలో చిక్కుకుని, పంటకు సమయానికి ఎరువులు అందక చేతులు కాల్చుకుంటామే మోనన్న భయం అన్నదాతల గుండెల్లో రైళ్లు పరిగెట్టి స్తోంది. అటు దళారుల బారినపడలేక, ఇటు ప్రభుత్వ సాంకేతికతలో చిక్కుకుపోయి నలిగిపోతున్న రైతన్న ఆవేదనను పట్టించుకునేనాథుడే కరువయ్యారా? అన్న ప్రశ్న జిల్లాలో ఇప్పుడు ప్రతీ పొలం గట్టున వినిపిస్తోంది. రైతులకు యూరియా కష్టాలు తీరుస్తామని చెప్పి యూరియా పంపిణీలో ఇబ్బందులను తప్పించడానికి యాప్‌ను వ్యవసాయ శాఖ తీసుకువచ్చింది. ఇప్పుడు రైతు యాప్ ద్వారానే యూరియాను బుక్ చేసుకోవాలి. అసలు సమస్య ఇక్కడే వచ్చింది. యాప్‌లో యూరియా కోసం బుక్ చేసే సమయంలో ఫలానా షాపుల్లో అందుబాటులో ఉందని చూపిస్తున్నప్పటికీ ఆ షాపులో బుక్ చేసుకొని వెళ్లేసరికి అక్కడమాత్రం యూరియా లేదని షాపు యాజమానులు చెప్పడం విస్మయానికి గురి చేస్తుంది.

## పంటల సాగుకు తిప్పలే...

పంటల సాగుకు ఈ సారి ఖరీఫ్ సీజన్ లో రైతులకు తిప్పలు తప్పే లా లేవన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఖరీఫ్ లోనే కష్టంగా ఉంటే ఇక రబీలో యూరియా దొరకడం సమస్యగా మారుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం యూరియా కోసం యాప్‌తెచ్చి యాప్ ద్వారానే బుకింగ్ చేసుకున్న వారికే అందించేలా చర్యలు తీసుకుంది. అయితే కొందరు నిరక్షరాస్యులు అయిన రైతులకు యాప్ వాడకం తెలియకపోవడం.. ఇతరులతో బుకింగ్ చేయించుకొని సంబంధిత షాపు వద్దకు యూరియా బస్తాల కోసం వెళ్తే అక్కడ వారికి నిరాశేఏ దురవుతుందని చెబుతున్నారు. యూరియా అందుబాటులో లేదంటూ చెప్పడంతో చేసేదేమి లేక తిరుగుముఖం పడుతున్నామని చెబుతున్నారు.

## యాప్‌లోనే యూరియా...

ప్రభుత్వం తీసుకువచ్చిన యాప్ లోనే యూరియా అందుబాటులో ఉన్నట్లు చూపుతున్నప్పటికీ పరిస్థితి మాత్రం భిన్నంగా ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. యూరియా బస్తాల కోసం పడిగాపులు కాయాల్సి వస్తుందని పేర్కొంటున్నారు. ఇదిలా ఉంటే ఎకరానికి ఒకటే బస్తా ఇస్తామని చెప్పడం, యాప్ లో అంతే చూపడంతో చేసేదేమిలేక రైతులు పడిగాపులు గాసి రెండు, మూడు రోజులుతిరిగి తీసుకెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. రైతులకువ్యవసాయం కోసం కావాల్సిన ఇటువంటి వాటిని సులభతరం చేయాల్సిందిపోయి యాప్ తో అష్టకష్టాలు తెచ్చినట్లయిందని చెబుతున్నారు. దళారులకు చెక్ పెట్టబోతే.. రైతులకు తిప్పలు.. యూరియా దళారుల చేతికి చిక్కకుండా యాప్ ను తీసుకొచ్చింది ప్రభుత్వం. అయితే దళారుల మాట అటుంచితే ఇప్పుడు రైతులకు సమయానికి యూరియా అందక తిప్పలుపడాల్సిన పరిస్థితి నెలకొంది. ఇప్పటి కైనా రైతులకు సకాలంలో యూరియా అందేలా చూడాలని వేడుకుంటున్నారు.



జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక



## ప్రకాశం

# పొగాకు రైతులను ఆదుకోండి

✳ గిట్టుబాటు ధర వచ్చేలా చూడాలి ✳ బోర్డు అధికారులు చొరవ తీసుకోవాలి ✳ కంపెనీ ప్రతినిధులపై ఒత్తిడి తేవాలి ✳ రైతులు సాగు చేస్తేనే.. మీరు వ్యాపారం చేస్తారు ✳ రైతుకు కిలోకు రూ.230 వచ్చేలా చూడాలి ✳ సమస్య పరిష్కరించకపోతే ముఖ్యమంత్రిని కలుస్తాం ✳ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ దివి శివరాం ✳ పొగాకు కొనుగోళ్లు పరిశీలన ✳ రైతులతో సమావేశం

**కందుకూరు, జూన్ 16 (జాతీయ వార్త):** పొగాకు రైతులకు గిట్టుబాటు ధర కల్పించేలా బోర్డు అధికారులు చొరవ తీసుకొని పొగాకు కంపెనీ ప్రతినిధులపై ఒత్తిడి తేవాలని కందుకూరు మాజీ ఎమ్మెల్యే డాక్టర్ దివి శివరాం బోర్డు అధికారి అట్లూరి



శ్రీనివాసరావును కోరారు. మంగళవారం కందుకూరు పట్టణంలోని పామూరు రోడ్ లో గల పొగాకు బోర్డు ఫ్లోర్ నెం 27లో పొగాకు బేళ్లు కొనుగోళ్లు జరుగుతున్న తీరును శివరాం పరిశీలించారు. అనంతరం బోర్డు అధికారి కార్యాలయంలో పొగాకు కంపెనీ ప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేసి రైతులకు గిట్టుబాటు ధర కల్పించేలా మీ యాజమాన్యంతో మాట్లాడి రైతులకు న్యాయం చేయాలన్నారు. రైతులు వ్యవసాయం చేస్తేనే మీరు వ్యాపారం చేయగలరని దానిని



దృష్టిలో పెట్టుకొని గిట్టుబాటు ధర వచ్చే విధంగా కొనుగోలు చేయాలన్నారు. రైతు భవన్‌లో బోర్డు అధికారి శ్రీనివాసరావుతో కలిసి రైతులతో సమావేశమైన శివరాం రైతులు నాణ్యమైన పొగాకు బేళ్లను బోర్డుకు తీసుకురావాలన్నారు. త్వరలో రైతు నాయకుల ప్రతినిధి బృందంతో కలిసి పొగాకు కంపెనీల యాజమాన్యంతో సమావేశం అవుతామని అప్పటికి రైతులకు గిట్టుబాటు ధర కల్పించకపోతే వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును కలిసి రైతుల సమస్యలను వివరించి న్యాయం జరిగే విధంగా ప్రయత్నం చేస్తామని రైతులకు శివరాం భరోసా కల్పించారు. గత సంవత్సరం ఏ విధంగా పొగాకు బేళ్లను కొనుగోలు చేశారో అదేవిధంగా ఈసంవత్సరం కూడా కొనుగోలు జరిపి రైతులకు సగటున కిలోకు 230 రూపాయలు వచ్చేలా చూడాలన్నారు. శివరాం వెంట రైతు నాయకులు తానికొండ రమణయ్య, వలేటి నరసింహం, గుర్రం లక్ష్మీ నరసింహం, మాజీ ఎంపీపీ పొడపాటి శ్రీనివాసరావు, ప్రకాశం జిల్లా తెలుగుదేశం పార్టీ మాజీ అధికార ప్రతినిధి గోచిపాతల మోషే తదితరులు ఉన్నారు.



## జూలై 11న
## జాతీయ లోక్ అదాలత్

✳ సద్వినియోగం చేసుకోండి ✳ సీనియర్ సివిల్ జడ్జి, మండల న్యాయ సేవాధికారి కమిటీ చైర్మన్ బుల్లికృష్ణ





**కందుకూరు, జూన్ 16 (జాతీయ వార్త):** జూలై 11న జరిగే జాతీయ లోక్‌అదాలత్‌లో కక్షిదారులు పరస్పర అంగీకారంతో కేసులు రాజీ చేసుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి కేకేబీ బుల్లి కృష్ణ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక కోర్టులో జాతీయ లోక్ అదాలత్‌పై నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎక్కువ కేసులు పరిష్కారం అయ్యేలా చర్యలు చేపట్టాలని న్యాయవాదులకు పోలీసులకు సూచించారు. ఈ జాతీయ లోక్ అదాలత్ లో రెవెన్యూ, బ్యాంక్, బిఎస్ఎన్ఎల్, మున్సిపల్ అధికారులు ఎక్కువ కేసులు పరిష్కారమయేందుకు చూడాలని అన్నారు. కోర్టుల వరకు వెళ్ళని ప్రీ లిటిగేషన్ కేసులను కూడా పరిష్కరించుకోవచ్చన్నారు. కోర్టులోని అన్ని రకముల సివిల్ కేసులు, చెక్ బౌన్స్ కేసులు, భరణం కేసులు, గృహహింస కేసులు, రాజీ పడదగిన క్రిమినల్ కేసులు, పరిష్కరించబడతాయని తెలియజేశారు. ఈ సమావేశంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి దుర్గా కళ్యాణి, అడిషనల్ మున్సిఫ్ మేజిస్ట్రేట్ అన్నపూర్ణ, కందుకూరు డీఎస్పీ బాల సుబ్రహ్మణ్యం, కందుకూరు బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ వలేటి శ్రీధర్ నాయుడు, సీనియర్, జూనియర్, మహిళా న్యాయవాదులు పాల్గొన్నారు.

## సర్‌పై శిక్షణ



**ఉలవపాడు, జూన్ 16 (జాతీయ వార్త):** ఉలవపాడు ప్రభుత్వ జూనియర్ కాలేజీలో మంగళవారం సర్ కార్యక్రమంలో బిఎల్ఓ, బిఎల్ఏలకు శిక్షణ ఇచ్చారు. ప్రతి బూత్ లెవెల్ ఆఫీసర్లు వారికీ కేటాయించి న బూత్ లెవెల్ అసిస్టెంట్ లను వెంట పెట్టు కొని ప్రతి ఇంటికి వెళ్లాలని అధికారులు సూచించారు. ఎలక్షన్ ఎస్ ఐ ఆర్ మాపింగ్ 95 శాతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉలవపాడు మండల ఏఎస్ఓ జె.పుష్ప లత, బిఎల్ఓలు, టీడీపీ, వైసీపీ తదితర పార్టీల నాయకులు పాల్గొన్నారు.

## అంకభూపాలపురంలో సర్ సర్వే

**వలేటివారిపాలెం, జూన్ 16 (జాతీయ వార్త):** వలేటివారిపాలెం మండలం అంక భూపాలపురం గ్రామంలో మంగళవారం సర్ సర్వే ప్రారంభమైంది. బూత్ నంబర్ 4, 5లో బిఎల్ఓ ఇమ్రాన్ ఖాన్. సాయి మోహన్ కృష్ణ సర్వే చేశారు. సర్వే ఫారాలను ప్రజలకు అందజేశారు. వారి వెంట బిఎల్ఏ మంగి సురేష్, తెలుగుదేశం పార్టీ నాయకులు పగడా మోహన్ కుమార్ తదితరులు ఉన్నారు.



## 19న పొగాకు రైతులతో ట్రాక్టర్ ర్యాలీ



**కందుకూరు, జూన్ 16 (జాతీయ వార్త):** పొగాకు రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని, పొగాకు రైతుల సమస్యపై రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని ఈనెల 19న ఒంగోలులో జరిగే ట్రాక్టర్ ర్యాలీ కి రైతులందరూ తరలిరావాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జే.జయంతిబాబు కోరారు. మంగళవారం కందుకూరు పామూరు రోడ్‌లోని 27వ వేలం కేంద్రం వద్ద రైతులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. పొగాకు ధర విషయంలో రైతులందరూ సంతృప్తికరంగా ఉన్నారని రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రి కే అచ్చె నాయుడు పేర్కొనడం హాస్యాస్పదమన్నారు. పంట పండించేందుకు రైతులకు అధికంగా ఖర్చులు అయ్యాయని, తీరా పండినపంటకు ప్రభుత్వం ధర కల్పించకపోవడం పట్ల రైతులందరూ ఆందోళనకరంగా ఉన్నారన్నారు. రైతులందరికీ కనీస మద్దతు ధర రాక పొగాకు వేలం కేంద్రాల వద్ద నిరసన తెలుపుతున్నా, ప్రభుత్వానికి పట్టకపోవడం విడ్డూరంగా ఉందని అన్నారు. సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో ఈనెల 19 జరిగే ట్రాక్టర్ ర్యాలీకి అధిక సంఖ్యలో రైతులు తరలి రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంయుక్త కిసాన్ మోర్చా నాయకులు ఎస్.ఏ. గౌస్, జీవీబీ కుమార్,రైతులు టీ. రమణయ్య, దామా. ప్రవీణ్, వలేటి. నరసింహం, రామచంద్రారెడ్డి, గుత్త.గోపి తదితరులు పాల్గొన్నారు.

## 18న మెగా జాబ్ మేళా

**ఉలవపాడు, జూన్ 16 (జాతీయ వార్త):** భారత చైతన్య యువజన పార్టీ అధ్యక్షులు రామచంద్ర యాదవ్ పుట్టినరోజు సందర్భంగా పుంగనూరులో ఈనెల 18వ తేదీన మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్టు 139 బీసీ కులాల జేఏసీ రాష్ట్ర చైర్మన్ మిరియం శ్రీనివాసులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు ఈ జాబ్ మేళా కార్యక్రమంలో నిరుద్యోగ యువతీ యువకులు పాల్గొని ఉద్యోగ అవకాశాలు పొందాలన్నారు. 10వ తరగతి నుండి పీజీ వరకు చదువుకున్న యువతి యువకులకు వినియోగించుకోవచ్చని చెప్పారు.

## వలేటివారిపాలెంలో పల్స్ పోలియో అవగాహన ర్యాలీ




**వలేటివారిపాలెం, జూన్ 16 (జాతీయ వార్త):** మండల కేంద్రమైన వలేటివారిపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ మణిదీపిక ఆధ్వర్యంలో పల్స్ పోలియోపై మంగళవారం అవగాహన ర్యాలీ జరిగింది. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుండి గ్రామంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మణిదీపిక మాట్లాడుతూ ఈనెల 28,29,30న పల్స్ పోలియో కార్యక్రమం జరుగుతుందని చిన్నారులకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేపించాలన్నారు. మండలంలో 0–5 సంవత్సరాల వయస్సు ఉన్న వారు 4010 మంది చిన్నారులు ఉన్నారని, నాలుగు రూటు సూపర్వైజర్లు పర్యవేక్షణలో చుక్కల కార్యక్రమం జరుగుతుందన్నారు. ఒక్కొక్క పోలియో బూత్ కి నలుగురు చొప్పున అంగనవాడి టీచర్స్, ఆశాలు, వాలంటరీలు, ఈ కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమం జూన్ 28 నుండి బూత్ దగ్గర పల్స్ పోలియో చుక్కలు వేస్తారని చెప్పారు. 29, 30న ఇంటింటికి తిరిగి మ్యాపింగ్ చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శివ సిద్ధప్ప, డాక్టర్ చందన, సిహెచ్ఓ శివరామయ్య, పీ. హెచ్.ఎన్.కేస్ సారమ్మ, ఆరోగ్య పరిరక్షణ కార్యకర్త పద్మావతి, సిబ్బంది పాల్గొన్నారు.

Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546